
క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పాత పాలువాయి(రెంటచింతల): మండలంలోని పాత పాలువాయి గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ వినాయక స్వామి ఆలయ 29వ వార్షికోత్సవం వేడుకలను శనివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గార్లపాటి శివ ప్రసాద్ వేకువజామునుంచే స్వామివార్లకు ప్రత్యేక పూజలు, గణపతి పూజ, పలురకాల అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. సాయంత్రం పులిహారను భక్తులకు పంపిణీ చేశారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి దీవెనలు పొందారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



దుర్గి: మండలంలోని కంచరగుంట గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ పాతబడిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వెనుకవైపున పాడుబడిన ఇంట్లో నలుగురు వ్యక్తులు సుమారుగా 6 అడుగుల లోతు తవ్వారు. ఈ ఘటనతో స్థానికులు ఏం జరుగుతుందో తెలియక కలవరపాటుకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వస్తుండడంతో విషయం తెలుసుకున్న ఘాతుకానికి పాల్పడిన వ్యక్తులు పోలీసులను చూసి పరారయ్యారు. పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించారు. ఉదయం గ్రామంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన విషయం దావానంలా వ్యాపించింది. ఘటనా స్థలాన్ని పలువురు గ్రామస్తులు సందర్శించారు.

చదువుకు పేదరికం అడ్డుకాకుడదు

గురజాల : చదువుకు పేదరికం అడ్డుకాకుడదని నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ మన్నెం కన్యకుమారి ప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థికి ఆర్థిక సాయం అందించారు. దాచేపల్లి మండలం నడికుడికి చెందిన గుడివాడ నాగలక్ష్మీ శ్రీనివాసరావు కుమార్తెకు ఉన్నత చదువుల నిమిత్తం రూ.24500లు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

పిడుగురాళ్ల: టీవీఎస్ ఎక్సెల్ బైక్‌ను క్రేన్ వాహనం ఢీకొన్న ఘటనలో వ్యక్తికి గాయాలైన ఘటన పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన కొక్కెర కోటయ్య టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్రవాహనంతో పోలీస్‌స్టేషన్ వైపు వస్తున్నాడు, అక్కడే డివైడర్ వద్ద నుంచి పెద్ద క్రేన్ వాహనం వస్తూ టీవీఎస్ ఎక్సెల్‌కు ఢీకొనడంతో కోటయ్య రోడ్డుపై పడ్డాడు. స్థానికులు వెంటనే పట్టణంలోని ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించారు. స్వల్ప గాయాలతో కోటయ్య బయట పడ్డాడు. ఈ ప్రాంతంలో డివైడర్ క్లోజ్ చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు. పాఠశాలలు తెరుచుకుంటే ఈ ప్రాంతంలో విద్యార్థులు తరచూ వస్తూవుంటారు. అందుకే ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అధికారులు డివైడర్‌ను క్లోజ్ చేయాలని పేర్కొంటున్నారు.

వాసవి అమ్మవారి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

గురజాల : వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయ కమిటీ అధ్యక్షుడుగా మూర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో శనివారం నూతన పాలకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూరు వెంకట పుల్లారావు, కోశాధికారిగా మన్నెం ప్రసాద్‌రావులు ఎన్నికై య్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ కమిటీ అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామన్నారు. నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ అధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్లు, పెనుగొండ అమృత లింగేశ్వరరావు, మండల అధ్యక్షుడు బొగ్గవరపు అక్కేశ్వరరావు తదితరులున్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని లబ్ధిదారులకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: గడిచిన నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం మీ అభివృద్ధికి చేసిన కృషిని చూచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రజలను కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏడవ రోజు శనివారం కారెంపూడిలో ప్రభుత్వ పీఆర్కే నిర్వహించారు. బ్యాంక్ సెంటర్ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించి, ఒకటి, రెండవ వార్డుల్లో పీఆర్కే పర్యటించారు. ప్రభుత్వ అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రతి గడపకు వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. ఇదే విధమైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ప్రతి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించి ఏమైనా ఇబ్బందులున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు మీ కుటుంబ ఉన్నతికి ప్రభుత్వం అందించిన చేయూతను మరువొద్దని ఎమ్మెల్యే పీఆర్కే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరోనా లాంటి కష్ట కాలంలో కూడా ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకుండా ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. ఎన్ని ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను ఆగని విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇంకా ఎన్నో పథకాలు అందిన విషయాన్ని ప్రజలకు ప్రభుత్వ విప్ పీఆర్కే వివరించారు. ఈ నేపథ్యంలో పేద కుటుంబాలు మరింత ఉన్నతంగా ఎదగాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం రాష్టానికి ఎంతో అవసరమన్నారు. చంద్రబాబునాయుడుకు పేదల పట్ల ఏ మాత్రం ప్రేమ లేదని పెట్టే గుణం అసలే లేదని అదే ఉంటే ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగిన సుదీర్ఘకాలంలో ఇలాంటి సంక్షేమ పథకాలు అమలు పరచలేక పోవడంతోనే అది అర్థం అయ్యిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దగాకోరు రాజకీయాలకు మళ్లీ తెరమీదకు వచ్చాయని పేదలకు ఏదో చేస్తామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని వాటిని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటైనా నిజంగా నెరవేర్చారా అని ఆలోచన చేయాలని పీఆర్కే కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరంతరం ప్రజల బాగు కోసం శ్రమిస్తోందన్నిరు మంచి చేశాము కనుక ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. మళ్లీ అలాంటి మోసం జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన విషయాన్ని ప్రజలకు వివరించారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏ ఇబ్బంది రానివ్వలేదన్నారు. పేదల అభ్యున్నతి పట్ల ఇంతటి చిత్తశుద్ధి అంకిత భావం గల ముఖ్యమంత్రికి మద్దతుగా నిలిచి మన భవిష్యత్తును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గడప గడపలో ప్రభుత్వ విప్ పీఆర్కేకు సాదర స్వాగతం లభించింది. ప్రతి గడపలో ప్రజలు పీఆర్కే పట్ల ఆదరాభిమానాలు చూపారు. పూలమాలలు వేసి శాలువాలు వేసి పీఆర్కేతో వచ్చిన వారందరికి అల్పాహారాలు అందించి ఆదరించారు. బాణాసంచా కాల్చి అభిమానం చాటుకున్నారు. ఉత్సాహపూరిత వాతావారణంలో గడప గడప కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచి రమావతు ప్రమీలాభాయితేజానాయక్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కొంగర సుబ్రమణ్యం, బొమ్మిన అల్లయ్య, మండల సచివాలయాల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, మండల పార్టీ కార్యదర్శి పాతూరి రామిరెడ్డి, ఎంపీటీసీలు గుండెబోయిన అమృతలక్ష్మి, షేక్ ఆరీఫ్, అంతరగడ్డ ఏసోబు, వేముల లింగయ్య, ఉప సర్పంచ్ సూరె అంకారావు, పార్టీ నాయకులు కరాలపాటి సుబ్బారావు, చీతిరాల కోటేశ్వరరావు, గుండా శ్రీనివాసరావు, గుండా నరసింహారావు, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య, కొమ్మిరెడ్డి ఎర్రగురవారెడ్డి, ఉన్నం గిరి, రామదేని ఆంజనేయులు, ఉన్నం శ్రీనివాసరావు, పలిశెట్టి కోటేశ్వరరావు, చల్లా ప్రసాద్, కొమ్ము చంద్రశేఖర్, కిల్లా కాశి, ఆశం విజయభాస్కరరెడ్డి, కొమెర పిచ్చెయ్య, వార్డు మెంబర్లు మల్లారెడ్డి మాస్టారు, కాలె రాంబాబు, సయ్యద్ సాజన్, జొన్నలగడ్డ శ్రీను. మద్రి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండి, ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో వైద్యానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ కోట్ల రూపాయలను ఆరోగ్యానికి కేటాయిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాలకు చెందిన అనారోగ్యానికి గురైన వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద విడుదల చేసిన రూ. 5.60లక్షలు ఐదుగురు బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ మొట్టమొదట ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దేనన్నారు. ఆయన బాటలో నడుస్తూ అధికారం చేపట్టగానే ఆరోగ్యశ్రీని బలోపేతం చేసి లక్షలాది కుటుంబాలకు మేలు చేసేందుకు సీఎం జగన్ అనేక చర్యలు తీసుకున్నారన్నారు. అందులో భాగంగానే ఆరోగ్య శ్రీలో పూర్తిస్థాయిలో ఆర్థిక చేయూతనందిస్తూ లక్షల కుటుంబాలను ఆదుకుంటూ ప్రతి కుటుంబంలో వెలుగు నింపేందుకు ప్రయత్నిస్తున్న సీఎం వైఎస్ జగన్ అన్నారు. నియోజక వర్గంలో వేలాది మందికి రూ. 5కోట్లకు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చేయూతనందించారన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలన్నింటికి చెక్కులందజేసి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఆయా ప్రాంత వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిదులు పలువురు పాల్గొన్నారు.

కన్నెగంటి ఘాట్ వద్ద విగ్రహాన్ని ఏర్పాటుచేస్తాం



కన్నెగంటి హనుమంతు ఘాట్ సందర్శించిన డా బుద్ధ ప్రసాద్, చందు శ్రీనివాస్

దుర్గి: స్వాతంత్ర సమరయోధుడు, పుల్లరి ఉద్యమ నేత, పల్నాటి బెబ్బులి కన్నెగంటి హనుమంతు విగ్రహాన్ని ఆయన ఘాట్ వద్ద ఏర్పాటు చేయనున్నట్లు అమెరికన్ ప్రోగ్రసీవ్ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చందు శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన మాజీ శాసనసభ ఉప సభాపతి డా'' మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి కోలగొట్ల సమీపంలోని కన్నెగంటి హనుమంతు ఘాట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో మహాత్మాగాంధీజీ పిలుపునందుకుని స్వాత్రంత్య సంగ్రామంలో అసువులుబాసిన మహనీయుని కొనియాడారు. ఇలాంటి మహాత్ములను భావి తరాలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తన సొంత నిధులతో ఘాట్ వద్ద విగ్రహాన్ని నెలకొల్పి ఘాట్‌ను అభివృద్ధి పరుస్తానని తెలిపారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే నిలువెత్తు విగ్రహ ఏర్పాటుకు స్థానిక ప్రజానీకం సహకరించాలని కోరారు. అనంతరం దుర్గి బస్టాండ్ సెంటర్‌లోని కన్నెగంటి హనుమంతు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగార్జున శిల్ప కళాశాల అధినేత చెన్నుపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పీవీఆర్

దుర్గి: పేద ప్రజల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టే వారి అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న జననేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. శనివారం దుర్గి మండలం కాకిరాల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు రామావత్ బాలకృష్ణ నాయక్, ఎంనారాయణ, రామావత్ మోహన్‌రావు నాయక్ తదితర కుటుంబాలకు చెందిన వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పీవీఆర్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలందరూ మద్దతు తెలియజేసి సీఎం జగన్‌ని మరలా సీఎంగా గెలిపించుకోవాలని ఆవశ్యకతను వివరించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తమ మద్దతును తెలియజేస్తున్నామని రాబోవు రోజలలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి తామంతా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మాచర్ల రూరల్: గత నెల 29వ తేదీన మాచర్ల నుంచి పాలువాయి గ్రామానికి శుభకార్యానికి ద్విచక్ర వాహనం పై వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో వేముల గోవిందు (52) తీవ్రంగా గాయపడ్డాడు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

రీ సర్వేలతో న్యాయం చేస్తాం

బొల్లాపల్లి: జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని మూగచింతలపాలెం గ్రామ సచివాలయంలో రీ సర్వేపై శనివారం తహసీల్దార్ వి.సుధాకర్ శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెండో విడతలో వడ్డెంగుంట రెవెన్యూ గ్రామ పరిధిలో తొలుత రీ సర్వే ప్రారంభమైందన్నారు. డ్రోన్ సర్వేలో ఓ ఆర్ఐ మ్యాప్స్ సేకరణ పూర్తయిందని, క్షేత్రస్థాయిలో రీసర్వే ఈ రెవెన్యూ పరిధిలో ప్రారంభించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వేలో భాగంగా మూడు బృందాలను ఏర్పాటు చేశామని, ఒక్కొక్క టీం రోజు 40 ఎకరాలు సర్వే చేయాల్సిందని తెలిపారు. రీసర్వేలో అనుభవదారుడు, భూహక్కు తదితర వివరాలు సేకరించి ప్రతి రైతుకు న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

గురజాల (దాచేపల్లి) : పురుటినొప్పులతో బాధపడుతున్న బాలింతను 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు అధికమైయ్యా. దాచేపల్లికి చెందిన షేక్ రమిజాను గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు 108 వాహనంలో తరలిస్తుండగా మార్గం మధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ లక్ష్మీనారాయణ,పైలేట్ జె సుందర్ సింగ్‌లు తెలిపారు.

13న సాతులూరు వక్ఫ్ భూములకు కౌలు వేలం

నాదెండ్ల: సాతులూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని షాహీ మసీదు భూములకు ఈ నెల 13న బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తున్నట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ కరిముల్లా బాషా తెలిపారు. సర్వే నెం.729,731లో 84.45 ఎకరాల భూమి ఉందని, 13వ తేదిన ఉదయం 10 గంటలకు సచివాలయంలో బహిరంగ కౌలు వేలం నిర్వహించనున్నందున ఆసక్తి గల రైతులు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

పచ్చరొట్ట ఎరువు విత్తనాలు పంపిణీ

శావల్యాపురం: రానున్న ఖరీఫ్ సీజను రైతులకు అవసరమైనవన్నీ రైతుభరోసా కేంద్రాలు ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తుందని మండల వ్యవసా య అధికారి రామినేని రామారావు శనివారం తెలిపారు. 11 రైతుభరోసా కేంద్రాల్లో పచ్చరొట్ట, జీలుగ, జనుము, పిల్లి పెసర తదితర విత్తనాలను రాయితీపై రైతులకు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.

ఐదు నుంచి యువతకు ఉచిత శిక్షణ

నరసరావుపేట: ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం, సింక్రో సర్వీస్ గ్లోబల్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల ఐదోతేదీ సోమవారం నుంచి యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నరసరావుపేట సెంటర్ మేనేజర్ కోట్ల శ్రీకాంత్ పేర్కొ న్నారు. శనివారం సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉచిత కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్, మగ్గం వర్క్స్, టాలీ, ఇన్వర్టరీ క్లర్క్, సీసీటీవీ ఇనస్టలేషన్, మొబైల్ రిపేరింగ్, బేసిక్ కంప్యూటర్ శిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. శిక్షణా అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు అరండల్‌పేట మోర్ సూపర్ మార్కెట్ పైన కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 63018 51504 సంప్రదించాలని కోరారు.

షాహీమసీదు భూములకు కౌలు వేలం

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు రెవిన్యూ పరిధిలో షాహీ మసీదు భూములకు బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లాబాషా శనివారం నిర్వహించిన వేలంలో రూ.10వేలు చొప్పున ధరావత్తు చెల్లించి ఏడుగురు హాజరయ్యారు. సర్వే నెంబరు 424, 425, 430లో 32 యకరాల భూమి ఉండగా, ఇందులో రోడ్లు, కాలువలు పోను 25 యకరాలు మాత్రమే మిగిలింది. వేలంలో పలువురు రైతులు పోటీపడ్డారు. యకరం ఏడాదికి రూ.5500ల చొప్పున హెచ్చుధరను షేక్ రోషన్ అనే రైతు స్వంతం చేసుకున్నా డు. 2023–2026 వరకూ మూడేళ్లకు గాను రూ.4,12,500ల ఆదాయం వక్ఫ్ బోర్డుకు లభించింది. హెచ్చుపాటదారు రోషన్ కొంత సొమ్ము జమచేయటంతో అధికారులు అనుమతి పత్రం అందించారు. అయితే ఈ భూములు రెండేళ్లుగా వేలం నిర్వహించకపోవటంతో పిచ్చిచెట్లు పెరిగి సాగుకు ఆటంకంగా మారింది.

డిప్యూటీ సర్వేయర్ సేవలు అభినందనీయం

శావల్యాపురం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మండల డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావుకు పదోన్నతి రావటం అభినందనీయమని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి రెవెన్యూ పరంగా మెరుగైన సేవలు అందించి అందరు మన్ననలు పొందటం సంతోషకరమన్నారు. బాపట్ల జిల్లా ఏడీ కార్యాలయం సర్వేయర్‌గా పదోన్నతి నియమాకం కాగా ప్రస్తుతానికి ఈపూరు మండలం డిప్యూటేషన్‌పై తుంగా శ్రీనివాసరావు వెళుతున్నట్లు చెప్పారు. అనంతరం మండల డిప్యూటి సర్వేయర్ తుంగా శ్రీనివాసరావును పూలమాలలలో దుశ్శాలతో ఘనంగా సత్కరించారు.

రేపటి నుంచి స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



బస్టాండ్ ప్రాంతంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం



ప్రతిష్ట మహోత్సవానికి సిద్ధంగా ఉన్న యాగశాల

మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి నూతన శిలా విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలకు సర్వం సిద్ధమైంది. అందులో భాగంగా దేవాలయానికి ఇప్పటికే నూతనంగా ఏర్పాటు చేసే శిలా విగ్రహాలైన శ్రీ సుదర్శన నరసింహస్వామి, రాజ్యలక్ష్మీ దేవి, వీరాంజనేయ స్వామి, జయ విజయ (ద్వారపాలకులు) విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం సోమవారం ప్రారంభించి విగ్రహాలను గురువారం ఉదయం 7.30ని''లకు ప్రతిష్ట చేయనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావులు శనివారం తెలిపారు. ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం 5గం''లకు విష్వక్సేన పూజ, పుణ్యాహము, అఖండ దీపారాధన, మృత్యుంగ్రహణము, అంకురార్పణ, ఋత్విక్ వరణము, హోమం నిర్వహిస్తారన్నారు. 6వ తేదీన అగ్ని ప్రతిష్ట చతుర్థశ కలశస్థపన, బింబశుద్ధి, యుక్త హోమము, కుంభకళ వాహన జరిపి రాత్రి 7గం''లకు సామూహిక నరసింహ వ్రతము నిర్వహించనున్నట్లు తెలిపారు. 7వ తేదిన నవగ్రహారాధన, అధివాస హోమములు, సాయంత్రం 4గం''లకు శిలావిగ్రహాలు ఊరేగింపు, మహాశాంతి హోమం జరిపి, 8వ తేదిన గురువారం ఉదయం 5గం''లకు రత్నన్యాసము, ధాతున్యాసము, యంత్ర స్థాపన చేసి 7.33ని''లకు ప్రతిష్ట మహోత్సవము నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి వారికి ఉదయం 10గం''లకు మహా శాంతి కళ్యాణం జరిపి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్టా మహోత్సవానికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపి శ్రీవారి ఆశీస్సులు ప్రజలకు ఉండాలని విశేష పూజ లు జరుపుతారు. ఈ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు భక్తులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: విత్తనాలు విక్రయించే షాపుల నిర్వాహకులు అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక విత్తనాల షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి మాట్లాడారు. ఏపిలో లైసెన్స్ తీసుకోకుండా రైతులకు విత్తనాలను విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. విత్తనాల షాపు నిర్వహణకు సంబంధించి ప్రతి సంవత్సరం తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి(లైసెన్స్) తీసుకోవాలన్నారు. ఎవరైనా అనుమతులు లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఎంఆర్పీ(ప్రభుత్వం నిర్ణయించిన) ధరలకు ఇవ్వాలని సూచించారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలన్నారు. ధరల విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు అయితే అటువంటి షాపుల నిర్వాహకులపై శాఖా పరమైన చర్యలు తీసుకుని షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ అనుమతులు తీసుకోకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన విత్తనాలను ఇక్కడ అమ్మడం నేరమన్నారు. 30 నుంచి 35 రకాల కంపెనీలకు చెందిన హైబ్రేడ్ పత్తి, మిర్చి విత్తనాలను పరిశీలించామన్నారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో ఖచ్చితంగా విత్తనం ఏ కంపెనీకి చెందినది, రకం పేరు, లాట్ నెంబర్ తోసహా రసీదుపై రాయించుకుని పంట దిగుబడి వచ్చే వరకు కూడా భద్ర పరుచుకోవాలని రైతులకు సూచించారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థి గొడుగు గణేష్

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామ శివార్లోని ఏపి మోడల్ స్కూల్‌కి చెందిన విద్యార్థి గొడుగు గణేష్ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకానికి ఎంపికై నట్లు స్కూల్ ప్రిన్సిపల్ కె.పాపయ్య శనివారం తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఆర్థికంగా ఆదుకుని వారిలో డ్రాపవుట్ల సంఖ్యను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని అమలుచేస్తున్నట్లు తెలిపారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదువుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఈ స్కాలర్‌షిప్ (ఉపకారవేతనాన్ని) అందిస్తుందన్నారు. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థికి నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12 వేల స్కాలర్‌షిప్‌ను 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తిచేసే వరకు లభిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఈ ఉపకార వేతనం మూడు నెలలకు ఒకసారి రూ. 3 వేల చొప్పున నేరుగా తల్లిదండ్రులతో కలిపి ఒక జాయింట్ బ్యాంక్ అకౌంట్(ఎస్‌బీఐ)లో జమ చేయడం జరుగుతుందన్నారు.

దాచేపల్లి వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతులమీదుగా నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

గురజాల (దాచేపల్లి) : వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దాచేపల్లికి చెందిన ఎం శ్రీనివాసరావును నియమిస్తూ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శనివారం నియామకపత్రం అందించారు. ఎం శ్రీనివాసరావు పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నాడని పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికై న శ్రీనివాసరావును పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.